సాక్షి
మెదక్
సోమవారం ׀ 23 ׀ అక్టోబర్ ׀ 2023

మహాగౌరి సిద్ధిరాత్రిగా దుర్గమ్మ

దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏడుపాయల దుర్గమ్మ ఆదివారం మహిషాసుర మర్ధిని (మహాగౌరి సిద్ధిరాత్రి) అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం పూజారి శంకరశర్మ అమ్మవారిని ఎరుపు రంగు వస్త్రాలతో అలంకరించారు. సనాతనశర్మ వేద మంత్రాలతో పూజలు చేసి, భక్తులకుతీర్థ ప్రసాదాలు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి దుర్గమ్మను దర్శించుకున్నారు. వంజరి నవీన్, మౌనిక దంపతులు దుర్గమ్మ తల్లికి రూ.67వేలు విలువ చేసే, వెండి చెంబు, పల్లెం బహూకరించారు. కార్యక్రమంలో చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్ రెడ్డి, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

- పాపన్నపేట(మెదక్)



న్యూస్‌రీల్

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా: రోహిత్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రోహిత్‌రావు

చిన్నశంకరంపేట(మెదక్): ఈ ఎన్నికల్లో తనకు అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. శనివారం చిన్నశంకరంపేట మండలం మీర్జాపల్లి, మీర్జాపల్లి తండా, శేరిపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాలొకగన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనంపల్లి సోషల్ సర్వీస్ ద్వారా పేదలకు సేవ చేస్తున్నప్పటికీ, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయాలంటే అధికారం అవసరమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు పేద ప్రజలకు మేలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో మీర్జాపల్లి కాంగ్రెస్ నాయకులు మనోజ్, జనార్దన్, మాజీ ఎంపీపీ అరుణప్రభాకర్, చిన్నశంకరంపేట సర్పంచ్ రాజిరెడ్డి, గోపాల్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు శ్రీమన్‌రెడ్డి, గంగా నరేందర్, రామ్‌రెడ్డి, సుధాకర్, మోహన్‌నాయక్, బందెల సాయిలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీర్జాపల్లి మాజీ సర్పంచ్ నర్సమ్మ కాంగ్రెస్‌లో చేరారు.

నిన్న బీజేపీ.. నేడు బీఆర్‌ఎస్



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న ఎంపీటీసీ సునీత దంపతులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): రెండు రోజుల క్రితం బీజేపీ కండువా కప్పుకున్న చండూర్ ఎంపీటీసీ శనివారం రాత్రి తిరిగి టీఆర్‌ఎస్‌లో చేరారు. వివరాల్లోకి వెళితే.. చిలప్‌చెడ్ మండలం చండూర్ ఎంపీటీసీ దంపతులు గూగ్లోత్ సునీత, దేవ్లీనాయక్ దంపతులు మూడు రోజులు క్రితం బీజేపీ కార్యాలయంలో పార్టీ చేరారు. శనివారం రాత్రి మంత్రి హరీశ్‌రావు నివాసంలో వారు మళ్లీ బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు బెస్త లక్ష్మణ్, ఎంపీటీసీ సుభాష్‌రెడ్డి, సర్పంచ్‌లు శంకర్‌నాయక్, యాదగిరి, నాయకులు మాణిక్యరెడ్డి, ముకుందరెడ్డి, విఠల్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవిగా వర్గల్ విద్యాధరి

వర్గల్(గజ్వేల్): విద్యాధరి శరన్నవరాత్రోత్సవాలలో ఎనిమిదోరోజు ఆదివారం వర్గల్ సరస్వతి అమ్మవారు సకల సద్గతులు ప్రాప్తింపజేసే దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన అష్టోత్తర శత కలశాభిషేకంతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఆలయ వ్యవస్థాపకులు చంద్రశేఖర సిద్ధాంతి నేతృత్వంలో వేదపండితులు గణపతి పూజ నిర్వహించి, ఆలయ మండపంలో 108 కలశాలు, 108 శంఖువులు స్థాపించారు. దాదాపు రెండున్నర గంటల పాటు నేత్రపర్వంగా కొనసాగిన కలశాభిషేకం తిలకించి భక్తులు ఆనంద పరవశులయ్యారు. అభిషేకం అనంతరం విశేషాభరణాలు, పట్టువస్త్రాలు, పూలమాలలతో సర్వాలంకార శోభితులైన అమ్మవారు శ్రీదుర్గాదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు నవరాత్రోత్సవాలలో అమ్మవారి వైభవం తిలకించి తరించారు. సోమవారం దసరా మహోత్సవం సందర్భంగా 8.30 గంటల నుంచి భక్తులకు అమ్మవారి విజయ దర్శనం ఉంటుంది.

రాజకీయ ఉద్దండులు

ముఖ్యమంత్రి, మంత్రులుగా సేవలందిస్తున్న నేతలు

- ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా సీఎం కేసీఆర్
- ఆరుసార్లు గెలిచిన మంత్రి హరీశ్ రావు
- ఏడుసార్లు జహీరాబాద్ ఎమ్మెల్యేగా బాగారెడ్డి



నాటి మెతుకు సీమ, నేటి రిజర్వాయర్‌ల ఖిల్లా ఉమ్మడి మెదక్ జిల్లాకు రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక స్థానం ఉంది. ఎంతో మంది రాజకీయ ఉద్దండులు ఎమ్మెల్యేలుగా గెలుపొంది స్వరాష్ట్రంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కీలక పదవులు అధిరోహించారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్ రావు, రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రిగా తన్నీరు హరీశ్‌రావు కొనసాగుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉప ముఖ్యమంత్రిగా దామోదర రాజనర్సింహ, జగన్నాథరావు, మంత్రులుగా చెరుకు ముత్యంరెడ్డి, కరణం రామచంద్రరావు, మదన్ మోహన్, రాజనర్సింహ, సి. జగన్నాథరావు, గీతారెడ్డి, బాగారెడ్డి, ఫరీదుద్దీన్, బాబుమోహన్, రామచంద్రారెడ్డి, రాజయ్య, సునీతా లక్ష్మారెడ్డి పనిచేశారు. ఎమ్మెల్యేగా నాలుగు సార్ల కంటే ఎక్కువగా ఎన్నికైన వారి వివరాలతో కథనం.

– సాక్షి, సిద్దిపేట

ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన కేసీఆర్



ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు గెలుపొందారు. ఆరు సార్లు సిద్దిపేట, రెండు సార్లు గజ్వేల్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఈసారి ఎన్నికల్లో గజ్వేల్, కామారెడ్డి నియోజకవర్గాల నుంచి బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్నారు. సిద్దిపేట నుంచి 1985, 1989, 1994, 1999, 2001(ఉప ఎన్నిక), 2004, గజ్వేల్ నుంచి 2014, 2018లో గెలిచారు. 1983లో మదన్ మోహన్ చేతిలో ఓడిపోయారు. చంద్రబాబు కేబినేట్‌లో మంత్రిగా పని చేశారు. ఆ తర్వాత టీడీపీకి రాజీనామా చేశారు. టీఆర్‌ఎస్ పార్టీ స్థాపనకు ముందు అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా పని చేశారు.

నాలుగు సార్లు గెలుపొందిన మదన్‌మోహన్



సిద్దిపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా నాలుగు సార్లు మదన్ మోహన్ గెలుపొందారు. రెండుసార్లు ఓడిపోయారు. పీవీ నరసింహారావు, చెన్నారెడ్డి, అంజయ్య కేబినెట్‌లో మంత్రిగా పని చేశారు. 1970లో సిద్దిపేట నియోజకవర్గ ఉప ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీచేసి గెలుపొందారు. 1972, 1978, 1983లలో గెలుపొందగా 1989,1994లలో ఓటమి చెందారు.

ఓటమి ఎరగని నేతగా హరీశ్ రావు



ఓటమి ఎరగని నేతగా, ట్రబుల్ షూటర్‌గా రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. 2004లో కరీంనగర్ ఎంపీగా, సిద్దిపేట ఎమ్మెల్యేగా కేసీఆర్ గెలుపొందారు. దీంతో సిద్దిపేట ఎమ్మెల్యేగా కేసీఆర్ రాజీనామా చేయడంతో 2014లో జరిగిన ఉపఎన్నికల్లో ఎమ్మెల్యేగా హరీశ్‌రావు పోటీచేసి గెలుపొందారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఓటమి ఎరగనినేతగా కొనసాగుతున్నారు. 2014 (ఉపఎన్నిక), 2008(ఉపఎన్నిక), 2009, 2010 (ఉపఎన్నిక), 2014, 2018లలో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో భారీనీటి పారుదల శాఖ మంత్రి, 2018లో గెలుపొందిన తర్వాత ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రిగా హరీశ్‌రావు కొనసాగుతున్నారు. అంతకు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో యువజన క్రీడల మంత్రిగా పని చేశారు.

ఐదుసార్లు ఎమ్మెల్యేగా కరణం



మెదక్ ఎమ్మెల్యేగా ఐదుసార్లు కరణం రామచంద్రరావు గెలుపొందారు. ఇందులో నాలుగు సార్లు టీడీపీ తరుపున, ఒకసారి ఇండిపెండెంట్‌గా పోటీచేసి విజయం సాధించారు. 1999, 1994, 1985, 1983, 1972లలో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎన్‌టీఆర్, చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పని చేశారు. రామచంద్రరావు మరణం తర్వాత వచ్చిన 2002 ఉపఎన్నికల్లో ఆయన సతీమణి కరణం ఉమాదేవి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

స్పీకర్, మంత్రిగా పనిచేసిన రామచంద్రారెడ్డి



సంగారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన రామచంద్రారెడ్డి స్పీకర్, మంత్రిగా పనిచేశారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1962, 1972, 1983, 1985, 1989లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1989లో స్పీకర్‌గా, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కేబినేట్‌లో మంత్రిగా పని చేశారు.

సీపీఐ శాసనసభాపక్ష నాయకుడిగా విఠల్ రెడ్డి



నర్సాపూర్ నియోజకవర్గం నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా చిలుముల విఠల్ రెడ్డి గెలుపొందారు. సీపీఐ శాసన సభాపక్ష నాయకుడిగా పనిచేశారు. 1994, 1989, 1985,1978, 1962లలో సీపీఐ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి విజయం సాధించారు.

జహీరాబాద్ బాగారెడ్డి



ఏడుసార్లు జహీరాబాద్ ఎమ్మెల్యేగా బాగారెడ్డి విజయం సాధించారు. 1957, 1962, 1967, 1972, 1978, 1983, 1985లో వరుసగా ఏడుసార్లు గెలుపొందారు. చెన్నారెడ్డి, అంజయ్య, కోట్ల విజయ భాస్కర్ రెడ్డి కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. జహీరాబాద్ నుంచి అత్యధిక సార్లు గెలిచిన ఘనత బాగారెడ్డికే దక్కింది.

నాటి దొమ్మాట నేటి దుబ్బాకకు ఎమ్మెల్యేగా ముత్యంరెడ్డి సేవలు



నాటి దొమ్మట నేటి దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా చెరుకు ముత్యం రెడ్డి సేవలందించారు. 1989, 1994, 1999, 2009లో లలో దుబ్బాక ఎమ్మెల్యేగా ఈయన గెలుపొందారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పని చేశారు.

వలస ఓటర్ల వైపు నాయకుల చూపు

- ఆకట్టుకునే ప్రయత్నాల్లో పార్టీలు
- పండుగ నేపథ్యంలో గ్రామాలకు వచ్చిన ప్రజలు
- మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో మంతనాలు

మెదక్ కలెక్టరేట్: వలస ఓటర్లను ఆకట్టుకునేందుకు పార్టీల నాయకులు దృష్టి సారించారు. బతుకమ్మ, దసరా పండుగలు సందర్భంగా వివిధ ప్రాంతాలకు ఉద్యోగాలకు, బతుకుదెరువుకు వెళ్లిన వారంతా గ్రామాలకు తిరిగి వస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో సొంత గ్రామాలకు వచ్చే వలస ఓటర్లను తమవైపు ఆకట్టుకునేందుకు ఆయా పార్టీల నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. జిల్లాలో రెండు నియోజకవర్గాలు ఉండగా 14 మండలాలు, రెండు పట్టణాలు ఉన్నాయి. మెదక్ నియోజకవర్గంలోని మెదక్ పట్టణంతోపాటు మెదక్, హవేళిఘనపూర్, పాపన్నపేట, నిజాంపేట, చిన్నశంకరంపేట, రామాయంపేట, నార్సింగి మండలాలు ఉన్నాయి. నర్సాపూర్ నియోజకవర్గంలో నర్సాపూర్ పట్టణంతోపాటు వెల్దుర్తి, మాసాయిపేట, శివ్వంపేట, కౌడిపల్లి, నర్సాపూర్, చిలప్‌చెడ్, కొల్చారం మండలాలు ఉన్నాయి. నర్సాపూర్ నియోజకవర్గంలో చాలా వరకు తండాలు ఉన్నాయి. గిరిజనులు దసరా పండుగను అత్యంత వైభవంగా జరుపుకుంటారు. దీంతో పట్టణాలకు వలస వెళ్లిన గిరిజనులు తండాల బాట పట్టారు.

ఓటింగ్ వరకు ఉంటారా?

పండుగల నేపథ్యంలో గ్రామాలకు, తండాలకు వచ్చిన వారంతా ఓటు వేసే వరకు ఉంటారా? తిరిగి పట్టణాలకు వెళ్తారా? తెలియని పరిస్థితి. ఓటింగ్‌కు నెలరోజుల సమయం ఉండగా రాజకీయ పార్టీల నాయకులు వలస ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. పండుగ తర్వాత తిరిగి పట్టణాలకు వెళ్తారా? ఇక్కడే ఉంటారా? అనే విషయాలను ఆయా పార్టీల గ్రామస్థాయి నాయకులు ఆరా తీస్తున్నారు. దసరాకు వచ్చిన వారు నెలరోజులపాటు ఇక్కడ ఉండే అవకాశాలు తక్కువే. అయినా వారిని ఒప్పించేందుకు రాజకీయవర్గాలు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

ఆ ముగ్గురు ఎవరో?

- మెదక్ నియోజకవర్గంలో ఖరారు కాని బీజేపీ అభ్యర్థి పేరు
- నర్సాపూర్ నియోజవర్గంలో ఆగిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థుల ప్రకటన
- రెండింటికి కలిపి ముగ్గురు మాత్రమే ఖరారు



పద్మాదేవేందర్‌రెడ్డి



మైనంపల్లి రోహిత్

మెదక్: శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మెదక్ జిల్లాలో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఎన్నికలకు మరో 40 రోజుల గడువు మాత్రమే ఉంది. కానీ జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో ముగ్గురు అభ్యర్థులు మాత్రమే ఖరారు అయ్యారు. మరో ముగ్గురిని ఎప్పుడు ప్రకటిస్తారనేది జోరుగా చర్చ జరుగుతుంది. మెదక్ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను మాత్రమే ఖరారు కాగా బీజేపీ అభ్యర్థిని ప్రకటించలేదు. అలాగే నర్సాపూర్‌లో కేవలం బీజేపీ అభ్యర్థిని మాత్రమే ప్రకటించగా అక్కడ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు అభ్యర్థులను ప్రకటించలేదు. బీఆర్‌ఎస్ మెదక్ టికెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి ఇవ్వగా, ఇటీవలె బీఫాం అందించారు. కాంగ్రెస్ అభ్యర్థిగా మైనంపల్లి రోహిత్‌ను ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇద్దరూ ప్రచారంలో దూసుకుపోతున్నారు.

నర్సాపూర్‌లో సందిగ్ధం..

నర్సాపూర్‌లో బీజేపీ అభ్యర్థిగా ఎర్రగొల్ల మురళీ యాదవ్‌కు కేటాయించారు. కానీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించలేదు. బీఆర్‌ఎస్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్, మాజీమంత్రి సునీత లక్ష్మారెడ్డికి ఇవ్వనున్నట్లు ప్రచారం సాగుతుంది. ఆమెకు టికెట్ ఇస్తే మదన్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్లడమా, లేక స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగడమా.. అనేది ఆసక్తి నెలకొంది.

నర్సాపూర్ బీజేపీ అభ్యర్థిగా మురళీ యాదవ్

- ప్రస్తుతం మన్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు
- బీసీ నినాదంపై గలమెత్తిన నాయకుడు
- బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరిక



బీసీ నినాదంపై గళం..

నర్సాపూర్: నర్సాపూర్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్‌కు అవకాశం లభించింది. కండక్టర్ ఉద్యోగాన్ని 1995 సంవత్సరంలో వదిలి మొదట సీపీఐ మద్దతుతో నర్సాపూర్ సర్పంచ్‌గా పోటీ చేసి గెలుపొందారు. అనంతరం సీపీఐని వదిలి పలు పార్టీల్లో కొనసాగారు. టీడీపీలో జిల్లా అధికార ప్రతినిధిగా, బీఆర్‌ఎస్‌లో జిల్లా పార్టీ అధ్యక్షుడిగా కొనసాగగా ఆయన సతీమణి రాజమణి ఉమ్మడి జెడ్పీ చైర్ పర్సన్‌గా పని చేశారు. బీఆర్‌ఎస్‌లో ఉన్న సమయంలో పార్టీలో బీసీలకు న్యాయం జరగడం లేదని, ప్రగతిభవన్‌లో తొట్టి గ్యాంగ్ ఉందంటూ పార్టీ అధినేత కేసీఆర్‌పై 2022 ఆగస్టులో ఆరోపణలు చేయగా, మరునాడే పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. మురళీయాదవ్ కొంతకాలంగా బీసీ నినాదంపై గళం విప్పుతున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ అయిన తర్వాత బీజేపీలో చేరారు. అక్కడ కూడా బీసీలకు టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆయన బీసీ నినాదంపై గళం విప్పి అదే నినాదం ఆధారంగా ప్రస్తుతం నర్సాపూర్ బీజేపీ టికెట్ దక్కించుకున్నారని పార్టీ నాయకులు అంటున్నారు. ఆయన కుమారుడు అక్షయ్‌యాదవ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, అతడి పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

కండకర్టు నుంచి ఎమ్మెల్యేగా పోటీ వరకు..

- ఉద్యోగం: మురళీయాదవ్ 1985 నుంచి 1995 ఆర్‌టీసీ కండక్టర్‌గా..
- 1995 నుంచి 2005 వరకు రెండు పర్యాయాలు నర్సాపూర్ సర్పంచ్.
- 2008లో మురళీయాదవ్ టీడీపీ అధికార ప్రతినిధిగా నియామకం.
- 2014 నుంచి 2019 వరకు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు.
- 2020 నుంచి నర్సాపూర్ మున్సిపాలిటీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.
- అఖిల భారత యాదవ మహాసభలో ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

కమలంలో కాక

- బీజేపీ తొలి జాబితా ప్రకటనతో బయటపడ్డ అసంతృప్తి
- పటాన్‌చెరు, నర్సాపూర్ అభ్యర్థులను మార్చాలని డిమాండ్
- ప్రత్యేకంగా సమావేశమైన కమలం నేతలు
- అభ్యర్థిత్వాలపై పునరాలోచించాలని అధిష్టానానికి విజ్ఞప్తి



నర్సాపూర్‌లో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: బీజేపీ తొలి జాబితా ప్రకటనతో అసమ్మతి భగ్గుమంది. ప్రధానంగా పటాన్‌చెరు, నర్సాపూర్ అభ్యర్థుల ప్రకటనపై పలువురు పార్టీ నేతలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. అభ్యర్థిత్వాల ఎంపిక విషయమై కొన్ని రోజులుగా కసరత్తు చేసిన అధినాయకత్వం ఆదివారం 52 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి నలుగురిని ఖరారు చేసింది. దుబ్బాకకు సిట్టింగ్ ఎమ్మెల్యే రఘునందర్‌రావు, గజ్వేల్‌కు ఎమ్మెల్యే ఈటల రాజేందర్, పటాన్‌చెరుకు మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్, నర్సాపూర్‌కు మురళీయాదవ్‌లను అభ్యర్థులుగా ప్రకటించింది. పటాన్‌చెరు, నర్సాపూర్ అభ్యర్థుల ఎంపికపై పార్టీలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుంది.

పటాన్‌చెరులో తిరుగుబావుట..

పటాన్‌చెరు టికెట్ నందీశ్వర్ గౌడ్‌కు ప్రకటించగా బీజేపీకి చెందిన పలువురు నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇస్నాపూర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో అసంతృప్త నేతలంతా సమావేశమయ్యారు. ఎనిమిది మంది పార్టీ మండల అధ్యక్షులు, కార్పొరేషన్ డివిజన్ అధ్యక్షులు, మున్సిపాలిటీల అధ్యక్షులంతా హాజరయ్యారు. ఈ టికెట్ విషయంలో అధినాయకత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. ఆయనను ఎట్టి పరిస్థితుల్లో మార్చాలని కోరారు. పూటకో పార్టీ మారుతూ పార్టీలో ఉన్న నాయకులు, కార్యకర్తలపై పెత్తనం చెలాయిస్తున్న వ్యక్తిని అభ్యర్థిగా ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. కాగా ఈ టికెట్‌ను నందీశ్వర్ గౌడ్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడీల శ్రీకాంత్‌గౌడ్, పార్టీ రాష్ట్ర మహిళా నాయకురాలు గోదావరి అంజిరెడ్డి, నాయకులు ఎడ్ల రమేష్ తదితరులు ఆశించారు.

స్వతంత్రంగా బరిలోకి దిగే యోచనలో గోదావరి అంజిరెడ్డి

పటాన్‌చెరు టికెట్ కోసం తీవ్ర ప్రయత్నం చేసిన గోదావరి అంజిరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగాలనే యోచనలో ఉన్నట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ టికెట్ విషయమై ఆమె అన్ని ప్రయత్నాలు చేశారు. కానీ అధినాయకత్వం మాత్రం నందీశ్వర్ గౌడ్ వైపే మొగ్గుచూపింది.

నర్సాపూర్‌లోనూ..

మున్సిపల్ చైర్మన్ ఎర్రగొల్ల మురళీయాదవ్‌కు నర్సాపూర్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడంపైనా అసమ్మతి సెగలు రేగుతున్నాయి. ఆశావహులైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శింగాయపల్లి గోపీ, నాయకులు రఘువీరారెడ్డి తదితరులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సందర్భంగా పలు ఆరోపణలు చేశారు. ప్రభుత్వ భూముల కబ్జాలకు పాల్పడిన వ్యక్తి అభ్యర్థిత్వం ఎలా ఖరారు చేస్తారని అసమ్మతి నేతలు ప్రశ్నించారు. అధినాయకత్వం ఈ విషయంలో పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. మొత్తంగా తొలి విడత అభ్యర్థుల ప్రకటనతో సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అసమ్మతి సెగలు భగ్గుమన్నాయి.

బతుకమ్మ.. వెళ్లి రావమ్మా..



బతుకమ్మ ఎత్తుకున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



మెదక్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

జిల్లా వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ అంగరంగ వైభంగా జరిగింది. మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా తీర్చిదిద్దారు. మెదక్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మను పేర్చి ఆడారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి చెరువుల్లో నిమజ్జనం చేశారు. అలాగే, కౌడిపల్లి పెద్ద చెరువు వద్ద బతుకమ్మ ఉత్సవాల్లో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పాల్గొన్నారు.

-మెదక్/మెదక్ మున్సిపాలిటీ/కౌడిపల్లి(నర్సాపూర్)



కౌడిపల్లిలో బతుకమ్మలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

క్లుప్తంగా

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి నందీశ్వర్ గౌడ్

పటాన్‌చెరు టౌన్: అవకాశం ఇవ్వండి.. పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అభివృద్ధితో పాటు, అన్ని వర్గాల వారికి మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి నందీశ్వర్‌గౌడ్ అన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న వంద పడకల ఆస్పత్రి, బస్టాండ్, ఆరు మోడల్ పాఠశాలలు అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏర్పాటు చేశానని గుర్తు చేశారు. బటర్ ఫ్లై వీధి దీపాలు, రామచంద్రాపురం వరకూ ఎంఎంటీఎస్ వేయించినట్లు తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే ప్రజల డబ్బు దోచుకుని కోట్లకు పడగెత్తాడని ఆరోపించారు. చివరికి ఆలయ భూమిని కూడా వదలలేదని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ వస్తే సంగారెడ్డి వరకూ మెట్రోరైలు వచ్చేలా చేస్తానన్నారు. అన్ని పార్టీలకు అవకాశం ఇచ్చారని, బీజేపీకి ఇస్తే అవినీతి లేని పాలన అందిస్తామని తెలిపారు.

బతుకమ్మ పూలకు వెళ్తూ..

కారు ఢీకొని యువకుడి మృతి



భాస్కర్(ఫైల్)

దుబ్బాకరూరల్: బతుకమ్మ పూలు తేవడానికి వెళ్తున్న యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందిన సంఘటన మండలంలోని రాజక్కపేటలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ గంగరాజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ముదిగొండ భాస్కర్(26) బతుకమ్మ పూలు కోసం బైక్‌పై దుబ్బాకకు వెళ్తున్నాడు. రాజక్కపేట శివారులో ఎదురుగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టడంతో భాస్కర్‌కు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. మృతుని తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం తరలిస్తూ పట్టుబడిన డీసీఎం

కొండపాక(గజ్వేల్): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్న కిష్టాపూర్ గ్రామ శివారులో పోలీసులు వాహనాలను తనిఖీ చేపట్టారు. ఇదే మార్గంలో గ్రామాల్లో సేకరించిన 100 బ్యాగులు (ఒక్కొక్క బ్యాగు 50 కిలోలు) రేషన్ బియ్యాన్ని డీసీఎంలో అక్రమంగా తరలిస్తూ పట్టుబడింది. దీంతో వాహనాన్ని సీజ్ చేసి సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం అందించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

న్యాయం చేస్తాం

మొయినాబాద్: భవిష్యత్ మనదే.. పార్టీకోసం కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. మండలానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొంపల్లి అనంతరెడ్డి తనకు అవకాశాలు దక్కడంలేదని.. పార్టీలో తగిన న్యాయం జరగడంలేదని కినుక వహించి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అనంతరెడ్డిని తీసుకుని వెళ్లి మంత్రి కేటీఆర్‌ను కలిశారు. అనంతరెడ్డి తన ఆవేదన మంత్రికి తెలియజేశారు. స్పందించిన ఆయన త్వరలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

సెంటిమెంట్ రిపీట్ అయ్యేనా?



చంటి క్రాంతికిరణ్ (బీఆర్ఎస్)



దామోదర రాజ నర్సింహా(కాంగ్రెస్)



- 13 సార్లు ఇక్కడ గెలిచిన పార్టీనే రాష్ట్రంలో అధికారంలోకి
- ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న పార్టీలు
- గెలుపుకోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ తీవ్ర ప్రయత్నం

వట్‌పల్లి(అందోల్): అందోలులో ఎమ్మెల్యేగా గెలిచిన పార్టీయే రాష్ట్రంలో అధికారంలోకి రావడం సెంటిమెంట్‌గా మారింది. ఆ సెంటిమెంట్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా కొనసాగింది. నవంబర్ 30వ తేదీన జరిగే ఎన్నికలను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. పోటాపోటీగా ప్రచారాలు మొదలు పెట్టాయి. ఇరు పార్టీల అభ్యర్థులు గెలుపుపై ధీమాతో ఉండగా, స్థానికంగా ఎవరు గెలిస్తే ఆ పార్టీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందన్న చర్చ ప్రారంభమైంది.

బీఆర్ఎస్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ అభ్యర్థిత్వాలు ఇది వరకే ఖరారు కావడంతో ఆ రెండు పార్టీలు దూసుకుపోతున్నాయి. బీజేపీ అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. బీఎస్పీ తరఫున ముప్పారం ప్రకాష్ పేరును ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. ఎవరికి వారు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. అందోలు ఫలితాలపైనే అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

8 సార్లు కాంగ్రెస్‌దే గెలుపు

అందోలు నియోజకవర్గం 1952లో ఏర్పడగా, 1967లో ఎస్సీ రిజర్వుడుగా మారింది. 1952 నుంచి 1985 వరకు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యాన్ని కొనసాగించింది. 1985లో తొలిసారిగా టీడీపీ నుంచి మల్యాల రాజయ్య విజయం సాధించారు. 1989లో దామోదర రాజనర్సింహ మొదటి సారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1998లో జరిగిన ఉప ఎన్నికల్లో సినీనటుడు బాబూమోహన్ ఎన్నికై తిరిగి 1999–2000 సంవత్సరంలో రెండో సారి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొంది మంత్రిగా పనిచేశారు. ఇప్పటివరకు 15 సార్లు ఎన్నికలు జరిగితే అందులో ఎనిమిది సార్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. తెలుగుదేశం పార్టీ నాలుగుసార్లు, ఒక్కసారి ఇండిపెండెంట్ అభ్యర్థి, రెండు సార్లు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలిచారు.

ముహూర్తాలు కలిసొచ్చేనా?

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్లను ఏ తేదీన, ఏ సమయంలో వేయాలో జాతకాలు చూపించుకుంటున్నారు. ఈ సారి నామినేషన్లను పోటాపోటీగా వేసేందుకు ఇప్పటినుంచే ముహూర్తాలు చూపించుకుంటున్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి క్రాంతికిరణ్ వేలాది మందితో ర్యాలీగా వచ్చి నామినేషన్ వేయగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాత్రం కేవలం ఐదుగురితో కలిసి వచ్చి నామినేషన్ సమర్పించారు. ఈసారి కూడా హంగామాతో నామినేషన్ వేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. నియోజవర్గంలో మొత్తం 2.25,714 మంది ఓటర్లు ఉండగా, ఇందులో మహిళలు 1,13,646.. పురుషులు 1,12,68 మంది ఓటర్లు ఉన్నారు.

జంగ్ తెలంగాణ

కనుమరుగైన చేర్యాల

- జనగామలో కలిసిన గ్రామాలు
- ప్రస్తుతం రెండు జిల్లాల్లో కొనసాగుతున్న నియోజకవర్గం



చేర్యాల పట్టణం వ్యూ

చేర్యాల(సిద్దిపేట): నాలుగు దశాబ్దాలు వెలుగొందిన చేర్యాల నియోజకవర్గం 2008లో కనుమరుగైంది. జనగామ నియోజకవర్గంలో కలిసిన చేర్యాల నియోజకవర్గంలోని మండలాలు ప్రస్తుతం రెండు జిల్లాల్లో కొనసాగుతున్నాయి. చేర్యాల, మద్దూరు, నర్మెట్ట, బచ్చన్నపేట(5గ్రామాలుకాదు) మండలాల గ్రామాలతో పాటు రఘునాథపల్లి మండలంలోని 2 గ్రామాలతో చేర్యాల నియోజకవర్గంగా ఉండేది. ఈ నియోజకవర్గంలో ఒక ఉప ఎన్నికతో కలిపి మొత్తం 11పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. నాలుగేసి సార్లు కాంగ్రెస్, టీడీపీ, రెండు పర్యాయాలు బీఆర్ఎస్, ఒక్కసారి సీపీఐ అభ్యర్థులు గెలుపొందారు. జనగామ నియోజకవర్గంలో కలిసి కనుమరుగైన చేర్యాలది ప్రత్యేక స్థానం. 1962లో ఏర్పడిన చేర్యాల నియోజకవర్గం 2009 ఎన్నికల్లో లేకుండా పోయింది. 1962లో కాంగ్రెస్‌కు చెందిన కమాలుద్దీన్, 1967లో సీపీఐకి చెందిన అబ్రహం ఎమ్మెల్యేలుగా గెలవగా 1972, 1978లో వరుసగా కాంగ్రెస్ నుంచి కాటం లింగయ్య, గొర్రె సిద్ధయ్యలు ఎన్నికయ్యారు. 1983, 1985, 1989, 1994లో టీడీపీ నుంచి నిమ్మ రాజిరెడ్డి వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది రికార్డు సృష్టించారు. అంతే కాకుండా ఈయన 1989లో ఎన్టీఆర్ కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. అనంతరం 1999లో కాంగ్రెస్ నుంచి నాగపురి రాజలింగం గెలవగా, తర్వాత జరిగిన 2004 సాధారణ, 2008 ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు చెందిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గెలుపొందారు. 2008లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా చేర్యాల నియోజకవర్గం జనగామలో కలిసింది. చేర్యాలను కలుపుకుని కొత్తగా ఏర్పడిన జనగామ నియోజకవర్గానికి 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పొన్నాల లక్ష్మయ్య గెలిచి వైఎస్ఆర్ మంత్రివర్గంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేశారు. అనంతరం జరిగిన తెలంగాణ ఉద్యమం, రాష్ట్రం ఏర్పాటు తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో అప్పటి పీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య మీద బీఆర్ఎస్ అభ్యర్థి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఘనవిజయం సాధించాడు. తర్వాత 2018లో జరిగిన ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ నుంచి ముత్తిరెడ్డి రెండో సారి విజయం సాధించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నుంచి బీఆర్ఎస్ తరఫున పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీజేపీ నుంచి ఆరుట్ల దశమంతారెడ్డి బరిలో నిలువగా, కాంగ్రెస్ టికెట్ ఇంకా ఎవరికీ ఖరారు కాలేదు.

జనగామ నియోజకవర్గ ఓటర్ల వివరాలు:

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
బచ్చన్నపేట	17,979	18,052	01	36,032
జనగామ	35,046	35,696	09	70,751
నర్మెట	9,341	9,284	-	18,625
చేర్యాల	20,697	20,600	-	41,297
తరిగొప్పుల	7,275	7,070	01	14,346
కొమురవెల్లి	6,948	6,839	-	13,787
మద్దూరు	7,962	7,629	-	15,591
మొత్తం	1,11,269	1,11,212	11	2,22,492

శిక్షణతో ఆత్మవిశ్వాసం పెంపు

రాష్ట్ర ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి



శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కాడెట్లు



నృత్య ప్రదర్శన చేస్తున్న కాడెట్లు

గజ్వేల్‌రూరల్: ట్రైనింగ్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ కాడెట్లకు క్రమశిక్షణతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని రాష్ట్ర ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో 12రోజులుగా కొనసాగుతున్న ఎస్ఎన్ఐసీ(స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్) ఆదివారం అట్టహాసంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల 17 డైరెక్టరేట్‌ల పరిధిలోని ఎన్‌సీసీ, ఎస్ఐసీ కాడెట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో కాడెట్లు సంగారెడ్డి సమీపంలోని ఆయుధ కర్మాగారం, హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, శిల్పారామం, ట్యాంక్‌బండ్, రామోజీ ఫిల్మ్‌సిటీ, గోల్కొండ కోట వంటి ప్రాంతాలను సందర్శించి వాటి వివరాలను తెలుసుకున్నట్లు చెప్పారు. అనంతరం గ్రూప్ సాంగ్, డ్యాన్స్‌లలో గెలుపొందిన విజేతలు శిక్షణ ముగింపు సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు క్యాంపు కమాండెంట్ కల్నల్ సునీల్ అబ్రహం తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ విద్యాధర్ పాల్గొన్నారు.

‘అధికార పార్టీకి ఓట్లు అడిగే హక్కు లేదు’



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

రామాయంపేట(మెదక్): ఎంపీగా సక్రమంగా బాధ్యతలు నిర్వర్తించని కొత్త ప్రభాకర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఏం అభివృద్ధి సాధిస్తారని దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ప్రశ్నించారు. ఆదివారం నార్సింగి మండలం వల్లూరు గ్రామంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేసింది శూన్యమని, ఆ పార్టీకి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని ఆయన విమర్శించారు. చిల్లర రాజకీయాలు చేసేవారిని ప్రజలు నమ్మరని, తగిన బుద్ధి చెపుతారని ఎమ్మెల్యే హెచ్చరించారు. రెండున్నరేళ్లలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన యువకులు బీజేపీలో చేరారు.

ఎన్నికల వేళ.. పటిష్ట నిఘా

- జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలు
- కోడ్ అమలుకు జిల్లాలో ప్రత్యేక టీమ్‌లు
- ఎప్పటికప్పుడు పర్యవేక్షణ
- ఆర్‌ఓ కార్యాలయాల్లో అందుబాటులో బృందాలు



నారాయణఖేడ్: అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడంపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోకుండా ప్రత్యేక నిఘా పెట్టింది. ఇందుకోసం తనిఖీ బృందాలను నియమించింది. వివిధ హోదాల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను వీటిల్లో సభ్యులుగా చేర్చారు. సంగారెడ్డి జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలతోపాటు, సరిహద్దుల్లో నిఘా పటిష్టం చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్ పలు నియోజకవర్గాల్లో టీం అధికారుల పనితీరును పర్యవేక్షిస్తున్నారు.

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీం (ఎంసీసీ)

మండల స్థాయిలో ఎంపీడీవోలు, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణ ప్రాంతాల్లో కమిషనర్లు ఎన్నికల కోడ్ అమలుతీరును పర్యవేక్షిస్తున్నారు. కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే వీరు ప్రభుత్వ పథకాల ప్రచార ఫొటోలు, ఫ్లెక్సీలు, వాల్‌పెయింటింగ్స్, పార్టీల జెండాలను ఇప్పటికే తొలగించారు. ఎవరైనా కోడ్‌ను అతిక్రమిస్తే జిల్లా ఎన్నికల అధికారులకు నివేదిస్తారు.

వీడియో ఫ్ల్యాయింగ్ టీం (వీవీటీ)

ఈ టీంలో ఒక డిప్యూటీ తహసీల్దార్, ఇద్దరు అసిస్టెంట్లు ఉంటారు. వీరు స్టాటిస్టిక్ సర్వైలెన్స్, వీడియో సర్వైలెన్స్ బృందాలతోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌లోని వీడియోగ్రాఫర్స్ తీసిన వీడియోలను పరిశీలించి నియమావళి ఉల్లంఘనలపై ఎన్నికల అధికారులకు నివేదిస్తారు.

వీడియో సర్వైలెన్స్ టీం (వీఎస్టీ)

సభలు, సమావేశాల్లో రాజకీయ నాయకులు, అభ్యర్థుల ప్రసంగాలతోపాటు ర్యాలీలు ఇతరత్రా ప్రచార కార్యక్రమాలను వీడియో చిత్రీకరించేందుకు ఈ బృందాన్ని నియమించారు. ఇందులో అధికారి, సహాయకుడు, ఒక వీడియో గ్రాఫర్ మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తారు. ఈ బృందాలు సంబంధిత నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి రోజువారీగా నివేదికలు సమర్పించాల్సి ఉంటుంది.

ఫ్లయింగ్ స్క్వాడ్ (ఎఫ్ఎస్టీ)

ఈ టీం సీ–విజిల్ యాప్‌కు వచ్చే ఫిర్యాదులను పరిశీలించి 100 నిమిషాల్లోపు పరిష్కరిస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘం నేషనల్ గ్రీవెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టంకు రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులను సైతం పరిష్కరిస్తాయి. ఓటర్లను ప్రలోభపెట్టడానికి దృష్టి సారిస్తుంది. ఇందులో ఒక అధికారితోపాటు హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక వీడియో గ్రాఫర్ ఉంటారు.

స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీం (ఎస్ఎస్టీ)

నామినేషన్ల పర్వం మొదలైన నాటి నుంచి ఈ బృందం తనిఖీలు మొదలు పెడుతుంది. ఇందులో ముగ్గురు సభ్యులు ఉంటారు. రెండు బృందాలు రెండు షిఫ్టుల్లో 24గంటలూ పనిచేస్తాయి. సభలు, సమావేశాలకు అభ్యర్థులు పెట్టే ఖర్చును పరిశీలిస్తాయి. అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు సమాచారం అందితే రహస్యంగా వీడియో రికార్డు చేస్తారు. సరిహద్దు, సమస్యాత్మక ప్రాంతాల్లో నియమావళి అమలు తీరును పర్యవేక్షిస్తుంటారు. వాహనాల తనిఖీలు సైతం చేపడతారు. వీరితోపాటు ప్రతీ నియోజకవర్గానికి అకౌంటింగ్ టీం ఎన్నికల సంఘం కేటాయించింది. ఎన్నికల్లో వ్యయ నియంత్రణకు ప్రత్యేక కసరత్తు చేసింది. ఓ సీనియర్ అధికారుల ఆధ్వర్యంలో ఈ టీం పనిచేస్తుంది.

ఖర్చు పరిశీలన..

అభ్యర్థుల ఎన్నికల ప్రచారం, సమావేశాలు, ఇతర ఖర్చుల వివరాలను అసిస్టెంట్ ఎక్స్‌పెండేచర్ టీం సేకరిస్తుంది. ఈ బృందంలో ఒక అధికారి, ఒక అసిస్టెంట్, ఇద్దరు ఎంపీఎస్వోలు ఉంటారు. నియోజకవర్గానికి ఒక బృందం పనిచేస్తుంది. నామినేషన్ల పర్వం ప్రారంభం అయ్యాక ఖర్చులకు సంబంధించిన టీం, అక్కౌంటింగ్ టీం పనితీరు జోరందుకోనుంది.

గతమెంతో ఘనం..



రామాయంపేట పట్టణం వ్యూ

- ముఖ్యమంత్రిని అందించిన రామాయంపేట పాత నియోజకవర్గం
- ప్రస్తుతం మున్సిపాలిటీ, రెవెన్యూ డివిజన్‌గా మారిన వైనం

రామాయంపేట(మెదక్): రామాయంపేట పాత నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున గెలుపొందిన టంగుటూరి అంజయ్య 1980లో ముఖ్యమంత్రి పదవి చేపట్టడంతో ఈ నియోజకవర్గానికి దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన అంజయ్య 85 వరకు సీఎంగా కొనసాగారు. కాలక్రమేణా పునర్విభజనలో భాగంగా రామాయంపేట నియోజకవర్గం నుంచి రెవెన్యూ డివిజన్, మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది.

వంద గ్రామాలతో తాలూకా కేంద్రంగా గుర్తింపు పొందిన రామాయంపేట 1952లోనే నియోజకవర్గంగా ఏర్పాటైంది. ఈ నియోజకవర్గంలో 1952 నుంచి 2008 వరకు 11 మంది ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. 2008లో పునర్విభజనలో నియోజకవర్గం ఎత్తివేయబడింది. గతంలో నియోజకవర్గంలో రామాయంపేట, చేగుంట, చిన్నశంకరంపేట, వెల్దుర్తి, కుల్చారం మండలాలతోపాటు మెదక్ మండలం నుంచి కొన్ని పంచాయతీలు ఉండేవి. చివరి ఎమ్మెల్యేగా 2004 నుంచి 2008 వరకు పద్మాదేవేందర్‌రెడ్డి కొనసాగారు. మధ్యంతరంగా 2008లో పార్టీ ఆదేశాలమేరకు పద్మ రాజీనామా చేయగా, తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో హన్మంతరావు ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాది పాటు పదవిలో కొనసాగారు. మండల కేంద్రంగా కొనసాగుతున్న రామాయంపేట నుంచి విడిపోయి నిజాంపేట ప్రత్యేక మండలంగా ఏర్పాటైంది. ఐదేళ్లక్రితమే రామాయంపేట మున్సిపాలిటీగా, రెండు నెలల క్రితం రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటైంది. 1978లో ఇక్కడినుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన ఆర్.ముత్యంరెడ్డి పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు మధ్యలోనే రాజీనామా చేయగా, 80లో టంగుటూరి అంజయ్య ఏకగ్రీవంగా ఎన్నికై సీఎం పదవి అలంకరించారు. రామాయంపేట పాత నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నుంచి ఏడుగురు, బీఆర్ఎస్ నుంచి ఇద్దరు, బీజేపీ, పీడీఎఫ్ నుంచి ఒక్కొక్కరు చొప్పున ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. వీరిలో రెడ్డి రత్నమ్మ, అంతిరెడ్డిగారి విఠల్‌రెడ్డి రెండుసార్లు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు.

నియోజకవర్గం నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలు

సంవత్సరం	పార్టీ	ఎమ్మెల్యే
1952-57	పీడీఎఫ్	ఆరుట్ల రాంచంద్రారెడ్డి
1962-67	కాంగ్రెస్	రెడ్డి రత్నమ్మ,
1967-72	కాంగ్రెస్	రెడ్డి రత్నమ్మ,
1972- 78	కాంగ్రెస్	కొండల్‌రెడ్డి
1978 -80	కాంగ్రెస్	ముత్యంరెడ్డి
1980- 85	కాంగ్రెస్	టీ.అంజయ్య
1985- 90	బీజేపీ	ఆర్ఎస్ వాసురెడ్డి
1990-94	కాంగ్రెస్	అంతిరెడ్డిగారి విఠల్‌రెడ్డి
1994-99	టీడీపీ	దేవర వాసుదేవరావు
1999-2004	కాంగ్రెస్	అంతిరెడ్డిగారి విఠల్‌రెడ్డి
2004-2008	బీఆర్ఎస్	పద్మాదేవెందర్‌రెడ్డి,
2008-	బీఆర్ఎస్	మైనంపల్లి హన్మంతరావు



మాజీ ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభమైన బస్టాండ్

మల్లన్న భూముల్లో అక్రమ నిర్మాణాలు



ఆలయ భూమిలో నిర్మిస్తున్న భవనం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాల్లోని భూములు ధరలకు రెక్కలొచ్చాయి. ఆలయానికి భక్తులు పోటెత్తుతుండటంతో రియల్ఎస్టేట్ వ్యాపారం మూడు పూలు ఆరు కాయలుగా కొనసాగుతుంది. కొంత మంది స్వామి వారి భూములలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అయినా ఆలయ అధికారులు నిద్రమత్తు వీడడంలేదు. ఈఓ, ఆలయ ఓ మాజీ చైర్మన్‌కు ముడుపులు తీసుకుని నిర్మాణాలు జరిపిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయ సమీపంలోని సబ్‌స్టేషన్ పక్కన గల సర్వే నెంబర్ 228లో ఆలయానికి 6 ఎకరాల భూమి ఉంది. గతంలో ఈ భూమిలో రెవెన్యూ అధికారులు సర్వే చేసి సుమారు 10 గుంటల భూమి అన్యాక్రాంతమైనట్లు తెలిపారు. ఇది చాలదన్నట్టు కొందరు తమ ఇళ్లను ఆలయ భూముల్లోకి విస్తరిస్తున్నారు. గతేడాది ఆ నిర్మాణాలను నిలివేశారు. ఇటీవల సదరు ఆక్రమణదారుడు గుట్టుచప్పుడు కాకుండా స్లాబ్ వేసి నిర్మాణం చేపడుతున్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలు అడ్డుకుని ఆలయ భూములు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రహరీ నిర్మించాలి

ఆలయ పరిసరాలలోని భూములు గజానికి వేల రూపాయల ధర పలుకుతుంది. కొందరు వాటిని ఆక్రమిస్తున్నారు. అధికారులు ఆ భూములకు సర్వే చేసి ప్రహరీ నిర్మించాలి.

–శెట్టిపల్లి సత్తిరెడ్డి స్థానికుడు

నోటీస్ అందించాం



ఆలయ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిసి గతేడాది నిలిపివేయించాం. సదరు వ్యక్తికి ఆదివారం మళ్లీ నోటీసులు ఇచ్చాం. భూమి సర్వే చేయాలని రెవెన్యూ అధికారులకు లేఖ రాశాం. వారు స్పందించలేదు. అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– ఆలయ ఈఓ. బాలాజీ

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం ॥ 23-10-2023

విజయ దశమి ప్రత్యేకం

స్త్రీ శక్తి విజయం విజయ దశమి



ఈ చరాచర జగత్తుని నడిపించేది శక్తి. ఈ శక్తి లేనట్టయితే బ్రహ్మా విష్ణు మహేశ్వరులు తమ తమ కృత్యాలైన సృష్టి స్థితిలయాలు నిర్వర్తించటమే కాదు, కదలటం కూడా చేత కాని వారవుతారు. ఆ శక్తినే అదిశక్తి, పరాశక్తి అంటారు. ఆ శక్తి త్రిగుణాత్మకంగా ఉంటుంది. సత్వరజస్తమో గుణాలతో శక్తిబీజం సంయోగం చెందితే 'స్త్రీ'అవుతుంది. అటువంటి త్రిగుణాలతో కూడిన శక్తి ఆవిర్భవించి దుష్టరాక్షస సంహారం చేసిన సమయం శరదృతువు.

ఇవే కాదు మహాశక్తి ఎప్పుడు ఎక్కడ దుష్టసంహారం చేయవలసిన అవసరం వచ్చినా, శిష్టరక్షణ చేయవలసిన అవసరం కలిగినా జీవులపై ఉన్న అంతులేని ప్రేమతో అవతరిస్తూ వచ్చింది. ఎంతైనా జగన్మాత కదా! అన్ని సందర్భాలలోను ఆ తల్లి ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు అవతరించి నవమి నాడు రాక్షససంహారం చేయటం జరిగింది. కనుక ఆదిపరాశక్తిని ఆ సమయంలో పూజించి ఆ తల్లి అనుగ్రహం పొందటం సంప్రదాయం అయింది.

అందరు దేవతల శక్తి ఏకీకృతమై రూపుదాల్చిన శ్రీదేవి రాక్షసులతో యుద్ధంచేసే సమయంలో దేవతలు, ఋషులు ఆమెకు పుష్టి కలగటానికి – యజ్ఞాలు, హోమాలు, జపాలు, తపాలు, పూజలు, పారాయణలు మొదలైన దీక్షలు పూనారు. మానవులు కూడా ఉడతాభక్తిగా తమకు తోచిన విధంగా దీక్షలు చేయటం మొదలు పెట్టారు.

ప్రథమంగా ఆవిష్కృతమైన శక్తి తమోగుణ ప్రధానమైనది. నిర్గుణయైన పరాశక్తి మొదటి సగుణ ఆవిర్భావం తమోగుణమయమైన మహాకాళి. అందువల్లనే మహాకాళీ మహాలక్ష్మీ మహాసరస్వతీ అని జగదంబిక త్రిశక్తులలో మొదటిదిగా మహాకాళినే పేర్కొనటం జరుగుతుంది.

ఇది వైవస్వత మన్వంతర వృత్తాంతం.

సావర్ణి మన్వంతరంలో ఆదిపరాశక్తి రజోగుణ ప్రధానమైన మహాలక్ష్మిగా అవతరించింది. దానికి హేతువు మహిషాసురుడు.ఈ తత్వాన్ని వంట పట్టించుకోవటం ఏ కాలం లోనైనా అవసరమే. మహిషాసురులు ఎప్పుడూ ఉంటారు. అందుకే మహిషాసుర మర్దినులైన మహాలక్ష్ముల అవసరం ఎప్పుడూ ఉంటుంది.

మహిషుని సంహరించేందుకు త్రిమూర్తుల నుంచి ఉద్భవించిన తేజస్సు అమ్మవారిగా ఆకారం ధరించింది. దేవతలందరూ ఆమెకు తమ తేజస్సును, ఆయుధాలను సమకూర్చారు. తన సంహారం కోసమే ఆమె ఆవిర్భవించిందని తెలిసినా మహిషుడు రకరకాలుగా ఆమెను ప్రలోభపెట్టాలని చూశాడు. ఆమె అంగీకరించకపోయేసరికి కామరూపి గనుక ఆమెతో రకరకాల రూపాలతో యుద్ధం చేశాడు. ఆ రూపాలకు తగిన రూపాలను ధరించి దేవి మహిషరూపంలో ఉన్న రాక్షసుని సంహరించింది. ఇది జరిగింది ఆశ్వయుజ శుద్ధ నవమి రోజున. అప్పటివరకు దీక్ష వహించిన వారందరు దశమి నాడు జగదంబను స్తుతించి, అమ్మకు పట్టాభిషేకం చేసి, స్త్రీ శక్తి విజయానికి వేడుకలు చేసుకుని ఆనందించారు. వారి స్తుతులకు సంతసించిన శ్రీదేవి వారిని వరం కోరుకోమన్నది. తమకు అవసరమైనప్పుడు ఈ విధంగా కాపాడమని కోరారు. ఆమె వారు తలచినప్పుడు అవతరిస్తానని మాట ఇచ్చింది.

మరొకప్పుడు శుంభ నిశుంభులనే దానవ సోదరులు వేల ఏండ్లు తపస్సు చేశారు. బ్రహ్మ వారి తపసుకి మెచ్చి, ప్రత్యక్షమై వరం కోరుకోమంటే – తమకు అమరత్వం ప్రసాదించమని కోరారు. బ్రహ్మ అది తన చేతులలో లేదని, ఇంకేదైన వరం కోరుకోమని అన్నాడు. వారు తమకు అమర, నర, పశు, పక్షి పురుషుల వల్ల చావులేని వరం ఇమ్మని కోరారు. అంతటితో ఆగలేదు. స్త్రీలు బలహీనులు కనుక మాకు వారి వల్ల భయం లేదు అని చెప్పారు. బ్రహ్మ తథాస్తు అన్నాడు. స్వర్గంపై దాడి చేసి, ఇంద్రుని ఆసనాన్ని అధిరోహించి, త్రైలోక్యాధిపత్యాన్ని, యాగభాగాలని కూడా హరించారు. దిక్పాలకులను సూర్యచంద్రాది దేవతలను గెలిచి, వారి పదవులను కూడా గ్రహించాడు. వారి పనులు కూడా తానే చేయటం మొదలు పెట్టాడు.

దేవతలు బృహస్పతి సూచననుసరించి హిమవత్పర్వతం మీద ఉన్న దేవిని శరణు వేడారు. జగదంబ వారికి అభయం ఇచ్చింది. ఆ సమయంలో సర్వదేవతలు తమ తమ శక్తులను జగదంబకు తోడుగా పంపారు. అవన్నీ ఆయా దేవతలకు చెందిన ఆభరణాలను, ఆయుధాలను ధరించి, వాహనాలను అధిరోహించి వచ్చి రక్తబీజుని సైన్యాన్ని మట్టు పెట్టసాగాయి. ఈ శక్తులను మాతృకాగణాలు అంటారు.

1. బ్రహ్మ శక్తి బ్రహ్మాణి.
2. విష్ణువు శక్తి వైష్ణవి
4. కుమారస్వామి శక్తి షష్ఠీ దేవి కౌమారి.
5. ఇంద్రుని శక్తి ఐంద్రి, మాహేంద్రి, ఇంద్రాణి అనే పేర్లు కూడా ఆమెకున్నాయి.
6. ఆదివరాహమూర్తి శక్తి వారాహీ దేవి
7. నృసింహుని శక్తి నరసింహ రూపం నారసింహీ అనే నామం.

ఈ మాతృకా గణంతో పాటుగా వరుణుని శక్తి వారుణీదేవి శత్రువులని పాశంతో బంధించి, మూర్ఛితులను చేసి, ప్రాణాలను తీస్తోంది.

యముని రూపంతో యముని శక్తి యామ్యాదేవి మహిషము నెక్కి, దండాన్ని ధరించి, భయం గొలిపే విధంగా రణభూమిలో అడుగు పెట్టి, దానవులని యమసదనానికి పంపుతోంది. వీరికి తోడు శివదూతి కూడ విజృంభించి దానవులను నేలకూల నేస్తూ ఉంటే, చాముండా, కాళికలు వారిని తినేస్తున్నారు.

దానవులు భయపడి పారిపోతుంటే రక్తబీజుని కోపం మిన్ను ముట్టి, దేవితో యుద్ధానికి వచ్చాడు. మాతృకాగణాలు అతడిపై ఆయుధాలను వేయగానే వాడి శరీరం నుండి కారిన ప్రతి రక్తబిందువు నుండి, ఒక్కొక్క రక్తబీజుడు పుట్టి వారి సంఖ్య అసంఖ్యాకం అయింది. దేవతలందరు భయభ్రాంతులై పోయారు. అప్పుడు అంబిక కాళికను నోరు పెద్దది చేసి, రక్తబీజుడి నుండి కారుతున్న రక్తాన్నంతా తాగివేయ మని చెప్పింది. వాడి శరీరం నుండి కారుతున్న రక్తాన్ని, కింద పడకుండా తాగటంతో వాడు నీరసించాడు. వాడి శరీరాన్ని శ్రీదేవి ముక్కలు చేస్తుంటే, కాళిక తినేసింది. అంబిక వాహనమైన సింహం కూడా ఎంతో మంది దానవులని తినేసింది.

అపుడు నిశుంభుడు శ్రీదేవితో యుద్ధానికి బయల్దేరాడు. ముందుగా నిశుంభుడి తల తెగ నరికింది దేవి. అయినా అతడి మొండెం కత్తి పట్టుకొని తిరుగుతుంటే ఆ మొండెం కాళ్ళు చేతులు నరికింది దేవి. దానితో నిశుంభుడు అసువులు బాసాడు.

శుంభుణ్ణి శ్రీదేవి తనతో యుద్ధం చేయలేకపోతే చండికతో గాని, కాళికతో గాని యుద్ధం చెయ్యమంది. అతడు పౌరుషం పెరిగి, శ్రీదేవితోనే యుద్ధం చేయదలచాడు. ఘోరయుద్ధం తరువాత శ్రీదేవి శుంభుని పరిమార్చింది. దేవతలకు తిరిగి స్వర్గ రాజ్యం లభించింది. మాటలతో సాధించిన విజయానికి సంకేతం ఇది. మాట నైపుణ్యంతో యుద్ధానికి ఆహ్వానించి గెలిచిన జగన్మాత అవతారాన్ని మహా సరస్వతిగా చెప్పటం జరిగింది.

సామూహికంగా కుంకుమార్చనలు చేసినా, చండీహోమాదులు చేసినా, బొమ్మల కొలువులు పెట్టినా, బతకమ్మలు ఆడినా కనపడేది ఏదైనా పది మంది కలిసి చేయాలనే ఐక్యభావన. శక్తి స్వరూపమైన స్త్రీ జాతి పట్ల గౌరవ మర్యాదలు నెరపటం.

''యా దేవీ సర్వ భూతేషు శక్తి రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః.''

– డాక్టర్ ఎస్.అనంతలక్ష్మి



నవరాత్రులు అన్నా, అమ్మవారి పూజలన్నా ప్రధానంగా చేసేది లలితా రహస్య నామ సాహస్ర పారాయణం. కుంకుమార్చన చేసినా సహస్రనామాలతోనే చేస్తారు. జగదంబ లలితాదేవిగా ఆవిర్భవించిన ఇతివృత్తం బ్రహ్మాండ పురాణం లలితో పాఖ్యానంలో వివరించబడింది. ఆమె సర్వచైతన్యస్వరూపిణి కనుక ఆమెను 'లలిత' అని పిలిచారు.తమను కన్నతల్లి లాగా భావించి శ్రీమాతా! అని సంబోధించారు. జీవితం అంటే సుఖపడటం – సుఖపడటం అంటే తినటం, నిద్రపోవటం మాత్రమే అని భావించటమే బండతనం. అటువంటి వారికి ఉండేది శూన్యమే కదా! బండతనం పోవాలంటే తగిన మార్గం ఒకటే. అది చైతన్యవంతులు కావటమే. అందుకే జగదంబ భండాసురవధ చేయటానికి సర్వచైతన్యస్వరూపిణిగా అవతరించింది. బండతనం మీద చైతన్యం విజయం సాధించటానికి సంకేతం విజయదశమి. శరన్నవరాత్రులలో అమ్మ అవతారాలలో లలితాదేవి అవతారం ఎంతో ప్రాధాన్యాన్ని కలిగి ఉంటుంది. నిజానికి శక్తి అన్నా, చైతన్యమన్నా ఒకటిగానే భాసిస్తాయి. చైతన్యం లేనిదే శక్తి వ్యక్తం అయ్యే అవకాశం లేదు కదా!



సమాజంలో ఎప్పుడూ మంచి చెడూ కలిసే ఉంటాయి. వాటి మధ్య జరిగే సంఘర్షణలో మంచి గెలవటానికి ప్రతీక విజయ దశమి. అలా మంచి గెలవటానికి ఎప్పుడు ఏ శక్తి కావాలో ఆ శక్తిగా అవతరించి సజ్జనులకు తోడుపడుతుంది జగన్మాత. అది శరీరంలో అనారోగ్యం కావచ్చు, మనస్సులో ఉన్న దుర్గుణాలు, దురాలోచనలు కావచ్చు, సమాజంలో ఉన్న దురాచారాలు, మూఢనమ్మకాలు కావచ్చు, ప్రకృతిని, పర్యావరణాన్ని కలుషితం చేసే మాలిన్యాలు కావచ్చును. సృష్టి నియమాలకి విరుద్ధంగా కలకాలం బతికి ఉండాలనే స్వార్థం కావచ్చును. ఒక జాతినో, వర్గాన్నో చులకన చేసే అహంకారం కావచ్చు ఒక జాతినో, వర్గాన్నో అవమానం చెయ్యటం కావచ్చును – ఇటువంటి ఎన్నో చెడులక్షణాల మీద విజయం సాధించిన రోజు విజయ దశమి. ముఖ్యంగా స్త్రీ పట్ల చులకన భావం కలిగిన దున్నపోతు మనస్తత్వం మీద స్త్రీ శక్తి విజయానికి సంకేతం విజయ దశమి. సద్భావనలు పెంపొందించుకునే రోజు. అందుకే ఒకరినొకరు అభినందించుకుంటూ జమ్మి పత్రాలని బంగారం, వెండి అనే పేరుతో పంచుకుంటూ ఉంటారు.

సినిమా

టైగర్ నాగేశ్వరరావు సంతృప్తి ఇచ్చింది - రవితేజ



అభిషేక్ అగర్వాల్, వంశీకృష్ణ, రవితేజ, వివేక్ కూచిభొట్ల, మయాంక్ సింఘానియా

"'టైగర్ నాగేశ్వరరావు' చిత్రాన్ని ప్రేక్షకులు, నా శ్రేయోభిలాషులు, నా అభిమానులు గొప్పగా ప్రశంసిస్తున్నారు. వాళ్లే ఈ సినిమాని బ్రహ్మాండంగా ప్రమోట్ చేయడం ఆనందంగా ఉంది. 'విక్రమార్కుడు' చిత్రంలోని విక్రమ్ రాథోడ్ తర్వాత నాకు మళ్లీ అంతటి సంతృప్తిని ఇచ్చిన పాత్ర 'టైగర్ నాగేశ్వరరావు'. ఈ చిత్రాన్ని ఇంత గొప్పగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని హీరో రవితేజ అన్నారు. వంశీ కృష్ణ దర్శకత్వంలో రవితేజ హీరోగా, నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న(శుక్రవారం) విడుదల అయింది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా సక్సెస్ మీట్‌లో రవితేజ మాట్లాడుతూ– ''అభిషేక్ అగర్వాల్ ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమాని తీశారు. ఆయన భవిష్యత్‌లో భారీ సినిమాలు తీసి, హిట్లు కొట్టాలి. వంశీలో మంచి ప్రతిభ ఉంది. తనతో మళ్లీ సినిమా చేయాలని ఉంది'' అన్నారు. ''నాకు ఇది పెద్ద సినిమా. రవితేజ, అభిషేక్‌గార్ల వల్లే ఇది సాధ్యపడింది. వీడు మావాడు అని చెప్పుకునేలా సినిమాలు తీస్తూనే ఉంటాను'' అన్నారు వంశీకృష్ణ. ''మా సినిమాకి ప్రేక్షకుల స్పందన, షోలు, వసూళ్లు రోజురోజుకి పెరుగుతున్నాయి'' అన్నారు అభిషేక్ అగర్వాల్. ఈ కార్యక్రమంలో నిర్మాతలు వివేక్ కూచిభొట్ల, మయాంక్ సింఘానియా తదితరులు పాల్గొన్నారు.

ఆ కిక్కే వేరు రా!

"నేను దాన్ని ఎంత ప్రేమిస్తున్నానంటే, దానికి ఫ్రెండ్స్, ఫ్యామిలీ ఎవరూ అక్కర్లేదు రా..! నేను చాలు..! ట్వంటీఫోర్ హవర్స్ పిల్ల నాతోనే ఉండాలనిపిస్తది.. నాది అని చెప్పుకోవడానికి ఓ గర్ల్ ఫ్రెండ్ ఉంటే.. ప్చ్.. ఆ కిక్కే వేరు రా..!'' అనే డైలాగ్స్‌తో కూడిన వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా మోషన్ పోస్టర్. హీరోయిన్ రష్మికా మందన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం ఇది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించనున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్‌మెంట్ పతాకాలపై విద్య కొప్పినేని, ధీరజ్ మొగిలినేని నిర్మించనున్న 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాను ఆదివారం అధికారికంగా ప్రకటించారు. ''ఈ ప్రపంచం ప్రేమకథలతో నిండిపోయి ఉంది. కానీ ఈ ప్రేమ కథల్లో ఇప్పటివరకు ఎవరూ వినని, చూడనవి కూడా ఉన్నాయి. 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రం అలాంటిదే'' అని ట్వీట్ చేశారు రష్మికా మందన్నా. ''ఈ సినిమా ప్రేక్షకులకు ఓ సరికొత్త అనుభూతిని ఇస్తుంది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వాహబ్, కెమెరా: కృష్ణన్ వసంత్.



'ది గర్ల్ ఫ్రెండ్' లో రష్మిక

అప్పుడే అది జరుగుతుంది - అల్లు అర్జున్



దేవిశ్రీ ప్రసాద్, అల్లు అర్జున్

''పుష్ప' చిత్రానికి నేను, దేవిశ్రీ ప్రసాద్ జాతీయ అవార్డులు అందుకోవడం సంతోషంగా ఉంది. ఏదైనా మనం మనసులో గట్టిగా అనుకుంటే జరుగుతుందని అంటుంటారు. అయితే మనం అనుకున్నా, కష్టపడినా అది యాభై శాతం మాత్రమే జరుగుతుంది. మిగతా యాభై శాతం మన చుట్టూ ఉన్న వాళ్లు కూడా కోరుకోవాలి.. అప్పుడే అది జరుగుతుంది'' అని హీరో అల్లు అర్జున్ అన్నారు. 'పుష్ప' చిత్రానికి జాతీయ ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ సంగీత దర్శకుడుగా దేవిశ్రీ ప్రసాద్ జాతీయ అవార్డులు సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. జాతీయ అవార్డుల్లో సత్తా చాటిన తెలుగు నటీనటులను, సాంకేతిక నిపుణులను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మాతలు నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ– ''నాకు జాతీయ అవార్డు రావాలని కోరుకునేవాణ్ణి. అయితే నా కంటే బలంగా కోరుకున్నారు దర్శకుడు సుకుమార్‌గారు. నేను అచీవ్‌మెంట్ అయితే సుకుమార్ అచీవర్'' అన్నారు. దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ–''అల్లు అర్జున్, సుకుమార్‌గార్లతో పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంటుంది. మైత్రీమూవీ మేకర్స్ అంటేనే రాజీపడని నిర్మాతలు'' అన్నారు. ఈ వేడుకలో నటుడు ప్రకాష్ రాజ్‌తో పాటు పలువురు హీరోలు, దర్శకులు, నిర్మాతలు, నటీనటులు పాల్గొన్నారు.

కృష్ణారామా మా ఇంట్లో పుట్టిన కథే - దర్శకుడు రాజ్ మదిరాజు



''ప్రస్తుతం చాలా మంది తమ తల్లిదండ్రులకు దూరంగా జీవిస్తున్నారు. దీంతో ఒంటరి తనంగా భావించిన తల్లిదండ్రులు తమ మనసులోని భావాలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసుకుంటున్నారు. మా తల్లిదండ్రులు కూడా ఒంటరితనాన్ని దూరం చేసుకోవడానికి ఫేస్ బుక్‌లోకి వచ్చారు. ఒక విధంగా '#కృష్ణారామా' కథ మా ఇంట్లో పుట్టిందే'' అని దర్శకుడు రాజ్ మదిరాజు అన్నారు. రాజేంద్ర ప్రసాద్, గౌతమి ప్రధాన పాత్రల్లో అనన్య శర్మ కీలక పాత్రలు పోషించిన చిత్రం ''#కృష్ణారామా'. అద్వితీయ మూవీస్‌పై వెంకట కిరణ్, కుమార్ కళ్లకూరి, హేమ మాధురి నిర్మించిన ఈ సినిమా ఆదివారం నుంచి ఓ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు రాజ్ మదిరాజు మాట్లాడుతూ– ''మన తల్లిదండ్రులు రిటైర్ అయిపోతే వాళ్ల జీవితమే అయిపోయిందనే భావనలోకి వెళ్లిపోతున్నాం. కానీ, వారి అనుభవం సమాజానికి ఎంతో అవసరం అని మా సినిమా ద్వారా చెబుతున్నాం. ఒక డైరెక్టర్‌గా నా పనిని నేను ఇష్టపడతాను. నటుడిగా నా పరిధిలోనే ఉంటాను.. డైరెక్టర్స్‌కి సలహాలు, సూచనలు ఇవ్వను. ప్రస్తుతం డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి సినిమాలో ఓ మంచి పాత్ర చేశాను. డైరెక్టర్‌గా రెండు మూడు కథలు సిద్ధంగా ఉన్నాయి'' అన్నారు.

ఓ సవాల్‌గా తీసుకున్నా - తల్లాడ వెంకన్న



వెంకన్న

తల్లాడ వెంకన్న హీరోగా నటించిన చిత్రం 'ఒక్కడే నెం.1'. సునీత, శృతిక, మధువని హీరోయిన్లుగా నటించారు. శ్రీపాద రామచంద్రరావు దర్శకత్వంలో క్లాసిక్ సినీ క్రియేషన్స్‌పై నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో తల్లాడ వెంకన్న మాట్లాడుతూ–''వ్యాపారవేత్తగా సక్సెస్ అయిన నేను, సినిమా రంగాన్ని కూడా ఓ సవాల్‌గా తీసుకున్నాను. మంచి కథ, కథనంతో 'ఒక్కడే నెం.1' తీశాం. సురేశ్ బాబు, ఏషియన్ ఫిలింస్ వారు తెలుగు రాష్ట్రాల్లో మా సినిమాను రిలీజ్ చేసేందుకు ఒప్పుకోవడంతో సినిమా విజయంపై మా నమ్మకం మరింత పెరిగింది. కర్ణాటకలో కూడా డైరెక్ట్ రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు. ''నేను గతంలో భక్తిరస చిత్రాలు తీశాను. వెంకన్నగారి ప్రోత్సాహం వల్లే 'ఒక్కడే నెం.1' లాంటి మంచి కమర్షియల్ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం లభించింది'' అన్నారు దర్శకుడు శ్రీపాద రామచంద్రరావు. నిర్మాతలు సి.కల్యాణ్, దామోదర ప్రసాద్, అంబికా కృష్ణ, తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, దర్శకుల సంఘం అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్, డైరెక్టర్ రేలంగి నరసింహారావు అతిథులుగా పాల్గొని, ఈ సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు.

భలే చాన్స్



శ్రీనిధి

'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి మంచి జోరుమీద ఉన్నారు. ఇటీవల తెలుగులో సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న 'తెలుసు కదా' సినిమాలో ఓ హీరోయిన్‌గా నటించేందుకు శ్రీనిధి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ బ్యూటీ భలే చాన్స్ అందుకున్నారు. కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ సరసన నటించనున్నారు శ్రీనిధి శెట్టి. హీరో సుదీప్, దర్శకుడు చేరన్ కాంబినేషన్‌లో సత్యజ్యోతి ఫిలింస్ ఓ సినిమాను నిర్మించనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించనున్నారు శ్రీనిధి. త్వరలోనే ఈ సినిమా సెట్స్‌లో జాయిన్ కానున్నారట ఈ బ్యూటీ.

తండ్రీకొడుకుల నేపథ్యంలో...



ధన్‌రాజ్

నటుడు ధన్‌రాజ్ దర్శకుడిగా మారారు. ఈ కొత్త చిత్రంలో తండ్రి పాత్రలో సముద్రఖని, కొడుకు పాత్రలో ధన్‌రాజ్ నటించనున్నారు. ప్రభాకర్ ఆరిపాక సమర్పణలో స్లేట్ పెన్సిల్ స్టోరీస్ బ్యానర్‌పై పొలవరపు పృథ్వి తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు సుబ్బు కెమెరా స్విచ్చాన్ చేయగా, నటుడు శివబాలాజీ క్లాప్ ఇచ్చారు. తొలి సన్నివేశానికి 'బలగం' దర్శకుడు వేణు గౌరవ దర్శకత్వం వహించగా, తెలుగు స్క్రిప్ట్‌ను దర్శకుడు రాజేంద్ర, తమిళ స్క్రిప్ట్‌ను దర్శకుడు భరత్‌కమ్మ యూనిట్ సభ్యులకు అందించారు. 'విమానం' చిత్ర దర్శకుడు శివ ప్రసాద్ యానాల ఈ మూవీకి కథ–మాటలు అందిస్తున్నారు. ''తండ్రీ కొడుకుల భావోద్వేగాల నేపథ్యంలో ఈ చిత్రం రూపొందనుంది. నవంబరు 9 నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించనున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రం ప్రారంభోత్సవంలో నటులు సుడిగాలి సుధీర్, చమ్మక్ చంద్ర, తాగుబోతు రమేష్, మధునందన్, భూపాల్, పృథ్వి, 'రాకెట్' రాఘవ తదితరులు పాల్గొన్నారు. ఈ సినిమాకు సంగీతం: అరుణ్ చిలువేరు, కెమెరా: దుర్గా ప్రసాద్.

అందరూ మెచ్చే చిత్రాలు చేస్తా - నిర్మాత సతీష్ కుమార్



''గతంలో నేను నిర్మించిన 'బట్టల రామస్వామి బయోపిక్', 'కాఫీ విత్ ఏ కిల్లర్' సినిమాలు ప్రేక్షకాదరణ పొందాయి. ప్రస్తుతం గౌతమ్ కృష్ణ హీరోగా ఓ చిత్రం నిర్మిస్తున్నాను. యువత, కుటుంబ ప్రేక్షకులతో పాటు అందరూ మెచ్చే చిత్రాలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నా'' అని నిర్మాత సెవెన్ హిల్స్ సతీష్ కుమార్ అన్నారు. గౌతమ్ కృష్ణ, శ్వేతా అవస్థి, రమ్య పసుపులేటి హీరో హీరోయిన్లుగా పి.నవీన్ కుమార్ దర్శకత్వంలో కొత్త సినిమా రూపొందుతోంది. సెవెన్ హిల్స్‌పై సతీష్ కుమార్ నిర్మిస్తున్నారు. నేడు (సోమవారం) తన పుట్టినరోజు సందర్భంగా సతీష్ కుమార్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ–''ఒక సాధారణ మధ్యతరగతి వ్యక్తి స్టూడెంట్ నుంచి కార్పొరేట్ స్థాయికి ఎలా ఎదిగాడు? అనే నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. గౌతమ్ కృష్ణ ప్రస్తుతం బిగ్‌బాస్ తెలుగు సీజన్ 7 షోలో ఉన్నారు. ఆ షో నుంచి తిరిగి రాగానే మా సినిమా చివరి షెడ్యూల్ పూర్తి చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: త్రిలోక్ సిద్ధు, సంగీతం: జుడా శాండీ.